క్లుప్తంగా

మాజీ సీఎంను కలిసిన రఫీ



వైఎస్ జగన్‌కు మొక్కను అందజేస్తున్న సుంకేసుల రఫీ

ఓబులవారిపల్లె : అన్నమయ్య జిల్లా వక్ఫ్‌బోర్డు మాజీ డైరెక్టర్ సుంకేసుల రఫీ బుధవారం విజయవాడ తాడేపల్లిలో మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రఫీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో మైనార్టీలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. వైఎస్ జగన్ హయాంలో మైనార్టీలకు అండగా నిలిచారని పేర్కొన్నారు. కూటమి మోసాలను ప్రజల్లోకి తీసుకెళతామని ఆయన తెలియజేశారు.

16 నుంచి ప్రతిష్టాపనోత్సవాలు

రాయచోటి టౌన్ : ఈ నెల 16వ తేదీ నుంచి 18వ తేదీ వరకు రాయచోటి పట్టణం గాలివీడు రోడ్డులో నూతనంగా నిర్మించిన ఆలయంలో శ్రీ గంగాదేవి అమ్మవారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు నిర్వహించునున్నట్లు సుగవాసి సుబ్రహ్మణ్యం, సుగవాసి ప్రసాద్ బాబులు తెలిపారు. దివంగత మాజీ ఎంపీ, ఎమ్మెల్యే సుగవాసి పాలకొండ్రాయుడు ఆధ్వర్యంలో నిర్మించిన ఈ ఆలయంలో 16న ప్రత్యేక పూజలు, యాగశాల ప్రవేశం జరుగుతుందన్నారు. 17న ఆదివారం పూజలు, అభిషేకాలు, హోమాలు తరువాత గ్రామోత్సవాలు, తీర్థప్రసాదాలు, మంగళహారతులు ఉంటాయన్నారు. 18న సోమవారం ఉదయం ప్రాతఃకాల పూజతో ప్రారంభమై, దీక్ష హోమ సహిత అవాహిత దేవత ప్రతిష్ట హోమం, విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు. మహోత్సవాలకు స్థానికులతో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన భక్తులు తరలిరావాలని కోరారు.

బాధ్యతల స్వీకరణ



ఓబుల్ రెడ్డి, ఏఈ, విద్యుత్‌శాఖ

పెనగలూరు : మండల విద్యుత్ ఏఈగా ఓబుల్ రెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఓబుల్ రెడ్డి కోడూరు మండలం సబ్ ఇంజనీరుగా పని చేస్తూ ప్రమోషన్‌పై పెనగలూరు మండలానికి వచ్చారు. ఈ సందర్భంగా ఓబుల్ రెడ్డి మాట్లాడుతూ మండలంలో ఎక్కడైనా విద్యుత్ సమస్య ఉంటే తన దృష్టికి తీసుకువస్తే యుద్ధప్రాతిపదికన సమస్యను పరిష్కరిస్తామని తెలియజేశారు. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు కృషి చేస్తామన్నారు.

రెవెన్యూ కార్యాలయం ఆకస్మిక తనిఖీ



అర్జీలు స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ భావన

పుల్లంపేట : మండల రెవెన్యూ కార్యాలయాన్ని బుధవారం రాజంపేట సబ్ కలెక్టర్ భావన తనిఖీ చేశారు. ప్రజలు నుంచి రెవెన్యూ సమస్యలకు సంబంధించి 30 అర్జీలు అందాయన్నారు. ఒక్కో రైతు సమస్యను క్షుణ్ణంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ పుల్లారెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ ప్రసన్న, ఆర్ఐ రాజశేఖర్, వీఆర్ఓలు పాల్గొన్నారు.

నాణ్యమైన వైద్యసేవలందించండి



ఆసుపత్రిని ప్రారంభిస్తున్న మోహన్‌రెడ్డి

రాయచోటి జగదాంబసెంటర్ : రోగులకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలని మాజీ ఎమ్మెల్యే మోహన్‌రెడ్డి సూచించారు. బుధవారం పట్టణంలోని గాలివీడు రహదారిలో ఏర్పాటైన ఇర్ఫాన్ ఐకేర్ కంటి ఆసుపత్రి ప్రారంభంలో ముఖ్య అతిథిగా మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. పట్టణంలో అధునాతన వసతి సౌకర్యాలతో ఆసుపత్రులు రావడం హర్షదాయకమని మోహన్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డా.బయారెడ్డి, వైఎస్ఆర్‌సీపీ మైనార్టీ జిల్లా అధ్యక్షుడు బేపారి మహమ్మద్‌ఖాన్, టెలికాం సభ్యుడు అబూజర్, బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి విజయభాస్కర్, స్టేట్ యూత్ కార్యదర్శి సూరం వెంకటసుబ్బారెడ్డి, యూత్ కొత్తపల్లె ఇంతియాజ్, జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు సగినాల శివశంకర్, పవన్, అర్షాద్, సోహెబ్ తదితరులు పాల్గొన్నారు.

గుట్టలు లేపేస్తున్నారు.. లక్షలు గడిస్తున్నారు!

- రెచ్చిపోతున్న మట్టి మాఫియా
- యథేచ్ఛగా అక్రమ తవ్వకాలు
- నిలువరించే కనుమరుగైందంటూ విమర్శలు



జేసీబీ సాయంతో గుట్టలను కొల్లగొడుతున్న అక్రమార్కులు



ట్రాక్టర్లలో అక్రమంగా తరలివెళ్తున్న మట్టి

గాలివీడు : అక్రమార్కుల తవ్వకాలతో గుట్టలు, చెరువులు కనుమరుగవుతున్నాయి. ప్రభుత్వ సంపదనను కొల్లగొడుతూ పర్యావరణానికి హాని కలిగిస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా విచ్చలవిడిగా మట్టి తవ్వకాలు జరుపుతున్నారు. రోజురోజుకు మండలంలో మట్టి మాఫియా రెచ్చిపోతోంది. మండలంలోని పలు గ్రామాల్లో అక్రమార్కులు ప్రభుత్వ భూముల్లోని గుట్టలను తవ్వి మట్టి అక్రమ రవాణా చేస్తు సొమ్ము చేసుకుంటున్నారు. గత కొద్ది రోజులుగా ఈ దందాకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. అయినప్పటికీ అక్రమ వ్యాపారాన్ని నిలువరించే వ్యవస్థే కరువైందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అక్రమ మట్టి వ్యాపారానికి కొందరు రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు సహకరిస్తుండటంతో అక్రమార్కులు తమ వ్యాపారాన్ని నిరాటకంగా కొనసాగిస్తున్నారు.

తరిగిపోతున్న గుట్టలు

అక్రమార్కుల తవ్వకాలతో ప్రభుత్వ భూములోని గుట్టలు తరిగిపోతున్నాయి. మండలంలోని గుర్రాల మిట్ట, కుమ్మరపల్లె వద్ద ఉన్న పేరాలగుట్ట, గాలివీడు పెద్ద చెరువు తదితర ప్రాంతాల్లోని గుట్టలను తవ్వి మట్టిని అక్రమ రవాణా చేస్తున్నారు. దీంతో ఇప్పటికే గుట్టలు మాయమై క్వారీలుగా దర్శనమిస్తున్నాయి. చెరువుల్లో తవ్వకాలు జరపడంతో క్వారీలుగా మారాయి.

పట్టపగలే తవ్వకాలు

అక్రమార్కులు పట్టపగలే జేసీబీ యంత్రాల సాయంతో మట్టిని తవ్వి ట్రాక్టర్లతో తరలిస్తూ తమ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. రెవెన్యూ కార్యాలయాలు పనిచేసే సమయంలోనే మట్టిని ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నప్పటికీ కనీసం అడ్డుకునేవారు లేకపోవడం గమనార్హం. దీంతో సోమవారం ఉదయం గుర్రాలమిట్టలో దాదాపు మూడుచోట్ల జేసీబీ యంత్రాలతో మట్టిని తరలించారు. అక్రమార్కులు ఒక్కొక్క ట్రాక్టర్ ట్రిప్‌ను రూ.800 నుంచి రూ.1000లకు విక్రయిస్తూ లక్షల ఆదాయాన్ని గడిస్తున్నారు.

పట్టించుకోని అధికారులు

మట్టి మాఫియా ప్రభుత్వ సంపదనను కొల్లగొడుతున్నప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడం ప్రజలను విస్మయాన్ని కలిగిస్తోంది. ప్రభుత్వ భూములు, చెరువులు, గుట్టలను తవ్వి అక్రమంగా మట్టి వ్యాపారాన్ని కొందరు కొనసాగిస్తున్నారని ప్రజలు రెవెన్యూ అధికారులకు సమాచారాన్ని ఇచ్చినా పట్టించుకోకపోవడం పట్ల పలు అనుమానాలకు తావిస్తోంది. అధికారుల అండలతోనే అక్రమార్కులు తమ మట్టి వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి అక్రమ మట్టి రవాణాను అరికట్టి ప్రభుత్వ సంపదను కాపాడే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

22న మండల సమావేశం

సిద్దవటం : మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 22వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఫణిరాజకుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 22వ తేదీ ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ అధ్యక్షతన సమావేశం జరుగుతుందన్నారు. సమావేశంలో వివిధ శాఖల అభివృద్ధిపై చర్చ ఉంటుందని, అన్ని శాఖల అధికారులు నివేదికలతో తప్పక హాజరుకావాలని చెప్పారు. అలానే జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కో-ఆప్షన్ సభ్యులు సమావేశానికి రావాలని ఎంపీడీఓ ప్రకటనలో పేర్కొన్నారు.

గుండెపోటుతో రైతు మృతి

ఓబులవారిపల్లె : తల్లెంవారిపల్లి గ్రామానికి చెందిన పోలి ప్రభాకర్ రెడ్డి (42) గుండెపోటుతో బుధవారం మృతి చెందాడు. ఐదు రోజుల క్రితం గ్రామంలో పొలం వద్దకు వెళ్లి వస్తుండగా ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. కాలు, చేయి పనిచేయకపోవడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతిలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతుండగా గుండెపోటు రావడంతో మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. మృతుడికి భార్య సుభాషిణి, కుమార్తె రెడ్డి నోహితలు ఉన్నారు.

సేంద్రియ ఎరువులపై ఆసక్తి చూపాలి

జిల్లా వ్యవసాయాధికారి శివనారాయణ



రైతులకు సూచనలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి శివనారాయణ

పీలేరు : రైతులు సేంద్రియ ఎరువులపై ఆసక్తి చూపాలని జిల్లా వ్యవసాయాధికారి శివనారాయణ అన్నారు. బుధవారం మండలంలోని మేళ్లచెరువు, తలపుల రైతు సేవా కేంద్రాలను సందర్శించారు. అనంతరం క్షేత్రస్థాయిలో పొలంపిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయనిక ఎరువులను తగ్గించి సేంద్రియ ఎరువులు వాడడం ద్వారా సాగు ఖర్చు తగ్గడంలో నాణ్యమైన పంట చేతికొస్తుందని తెలిపారు. రైతులు డ్రోన్ల టెక్నాలజీ ఉపయోగించుకుని కూలీల ఖర్చు కొరత తగ్గించుకోవచ్చునని చెప్పారు. రైతులు భూసార పరీక్షల ద్వారా సరైన మోతాదులో ఎరువులను వాడాలన్నారు. అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ లబ్ధి పొందే రైతులు ఏవైనా సమస్యలుంటే పరిష్కరించుకోవాలని తెలిపారు. అనంతరం అన్నమయ్య రైతు సహకారం సంఘంలో ఎరువుల నిల్వలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఏడీఏ వై.వి. రమణరావు, ఏవో రమాదేవి, అధికారులు నవ్వంత్, జ్యోత్స్న, బిందు, వెంకటరమణనాయక్ తదితరులు పాల్గొన్నారు.

బొప్పాయి ధర తగ్గలేదు

రాజంపేట సబ్‌కలెక్టర్ హెచ్ఎస్ భావన



రాజంపేట : బొప్పాయి ధర తగ్గలేదని రాజంపేట సబ్‌కలెక్టర్ హెచ్ఎస్ భావన బుధవారం తెలిపారు. ధర తగ్గిపోయిందంటూ వస్తున్న వార్తలు, సమాచారాన్ని రైతులెవ్వరు నమ్మవద్దన్నారు. బొప్పాయిని రూ.9 నుంచి రూ.10 వరకు కొనేందుకు వ్యాపారులు సిద్ధంగా ఉన్నారన్నారు. బొప్పాయి ధర కిలో రూ.7లకు తగ్గిపోయిందంటూ కొంతమంది దళారులు ఇచ్చే తప్పుడు ఫిర్యాదులు వార్త పత్రికల్లో, సామాజిక మాధ్యమాల్లో రావడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. తప్పుడు సమాచారం వల్ల రైతులు కాకుండా దళారులు ఇతరులు ఇవ్వడం వల్ల బొప్పాయిని తక్కువధరకు రైతుల దగ్గర కొనే విధంగా ట్రేడర్లు అవకాశాన్ని సృష్టించుకుంటున్నారన్నారు. మంగళవారం సబ్‌కలెక్టరేట్, రైల్వేకోడూరు తహసీల్దారుకు రైతుల దగ్గర నుంచి బొప్పాయిని తక్కువ ధరకు కొంటున్నారంటూ ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టామన్నారు. ఆ ఫిర్యాదులో నిజంలేదన్నారు. ఇటువంటి తప్పుడు ఫిర్యాదులు ఇస్తే కఠినచర్యలు తీసుకుంటామన్నారు. బొప్పాయి రైతులు తమ దగ్గర నుంచి రూ.9 కంటే తక్కువ ధరకు కొంటున్న ట్రేడర్లపై ఫిర్యాదు చేసేందుకు సబ్‌కలెక్టరేట్‌లో హెల్ప్‌లైన్‌ను ఏర్పాటు చేశామన్నారు. 9573990331 ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటలకు, 9030315951 మధ్యాహ్నం 2 గంటల నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు అందుబాటులో ఉంటారన్నారు. బాధిత రైతులు ఈ హెల్ప్‌లైన్‌ను సంప్రదించాలన్నారు. ఫిర్యాదు చేసేటప్పుడు ట్రేడర్ పేరు, ధర, వాహనం నంబరు నమోదు చేయాలన్నారు. రైతు, గ్రామం పేరు, సర్వేనెంబరు తప్పనిసరిగా ఉండాలని సబ్‌కలెక్టర్ తెలియచేశారు.

రాయచోటి డిప్యూటీ డీఈఓగా నాగయ్య



రాయచోటి జగదాంబసెంటర్ : నందలూరు మండల విద్యాశాఖ అధికారిగా పనిచేస్తున్న లంకాయగారి నాగయ్య రాయచోటి డివిజన్ ఉప విద్యాశాఖ అధికారిగా పూర్తి అదనపు బాధ్యతలను కేటాయిస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ సంచాలకులు వి.విజయరామరాజు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆయన త్వరలో రాయచోటి డిప్యూటీ డీఈఓగా బాధ్యతలను స్వీకరించనున్నారు. మండలంలోని లేబాక గ్రామానికి చెందిన నాగయ్య బీఎస్సీ, బీఈడీ చదివి సెకండరీ గ్రేడ్ ప్రభుత్వ ఉపాధ్యాయునిగా ఉద్యోగంలో చేరారు. పదోన్నతిపై జీవశాస్త్ర ఉపాధ్యాయులుగాను ప్రధానోపాధ్యాయులు గాను జిల్లాలో వివిధ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పనిచేసి ప్రస్తుతం నందలూరు మండల విద్యాశాఖ అధికారి-1గా విధులను నిర్వర్తిస్తున్నారు. డిప్యూటీ డీఈఓగా నాగయ్య నియామకం పట్ల మండలంలోని అన్ని ఉపాధ్యాయ సంఘాల బాధ్యులు, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మండలంలోని అందరు ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలి



రాజంపేట: పట్టణంలో సచివాలయ, మున్సిపల్ సిబ్బంది బైకు ర్యాలీ



పెనగలూరు: తిరంగా ర్యాలీని ప్రారంభిస్తున్న అధికారులు

నందలూరు : ప్రతి పౌరుడు తన ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటాలని ఎంపీడీఓ రాధాకృష్ణన్ పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదేశాల మేరకు మండలంలోని నందలూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా జవాన్ దారా రత్నమయ్యను ఎంపీడీఓ రాధాకృష్ణన్, డిప్యూటీ ఎంపీడీఓ సునీల్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, టీడీపీ నాయకులు మోడపోతుల రాము శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజల్లో దేశభక్తి భావనను మరింతగా పెంపొందించడంతో పాటు స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యాలయ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాజంపేట : రాజంపేట మున్సిపల్, సచివాలయాల సిబ్బంది, కమిషనరు శ్రీనివాసుల ఆధ్వర్యంలో బుధవారం బైకుర్యాలీ నిర్వహించారు. బైకు ర్యాలీని ప్రారంభించిన సందర్భంగా కమిషనరు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ప్రతి పౌరుడు తమ ఇంటిపై భాగంలో జాతీయ జెండాను ఆవిష్కరించి దేశభక్తి చాటాలన్నారు.

పెనగలూరు : మండల కేంద్రమైన పెనగలూరులో తిరంగా బైక్ ర్యాలీ బుధవారం ఎంపీడీఓ కార్యాలయం నుంచి నిర్వహించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం నుంచి పురవీధులలో ఈ ర్యాలీ సాగిందిరు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ జాతీయ జెండా ప్రాముఖ్యత, స్వాతంత్ర్య పోరాటం గురించి ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



నందలూరు: జవాన్‌ను సత్కరిస్తున్న అధికారులు

ముగిసిన ఎన్ఎంయూ ధర్నా



రాజంపేట: గ్యారేజీ ఎదుట ధర్నా చేస్తున్న ఎన్ఎంయూ నేతలు

రాజంపేట : రాజంపేట ఆర్టీసీ డిపో గ్యారేజీ ఎదుట నేషనల్ మజ్దూర్ యూనియన్ రెండు రోజుల పాటు చేపట్టిన ధర్నా బుధవారం నిర్వహించారు. డిపో కార్యదర్శి రమణ ఆధ్వర్యంలో ఈ ధర్నా కొనసాగింది. ఈ సందర్భంగా డిపో కార్యదర్శి రమణ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను చెల్లించాలన్నారు. పదన్నోతుల కల్పించాలన్నారు. ఆర్టీసీలో ఖాళీగా ఉన్న 8 వేలు పోస్టులను భర్తీ చేయాలని కోరారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సంస్థపరంగా వేతనాలు ఇవ్వాలన్నారు. వెంటనే పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేయాలని చెప్పారు. వేతన సంఘం ఆగిపోయిందని, వెంటనే ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. గవర్నర్‌పేట డిపో-2 స్థలాన్ని లీజుకు ఇచ్చిన జీఓను ఉపసంహరించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎంయూ డిపో కమిటీ, గ్యారేజీ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల వల్ల భవిష్యత్తు అంధకారం



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్ఐ ముత్యాల శ్రీనివాసులు

సుండుపల్లె : మత్తు పదార్థాలు వాడటం వల్ల యువత భవిష్యత్తు అంధకారం అవుతుందని ఎస్ఐ ముత్యాల శ్రీనివాసులు తెలిపారు. జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఆదేశాల మేరకు బుధవారం నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని మండల కేంద్రంలోని ఎంకేఆర్ జూనియర్ కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో యువత మత్తుకు అలవాటు పడి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని, పలువురు మత్తు పదార్థాలకు అలవాటు పడి డబ్బుల కోసం నేరాలు, హత్యలకు సైతం పాల్పడుతూ మంచి భవిష్యత్తును కోల్పోతున్నారని తెలిపారు. గంజాయి, ఇతర నిషేధిత మత్తు పదార్థాలు ఎక్కడ వినియోగించినా కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ప్రాణాంతకరమైన మత్తు పదార్థాలకు, మాదకద్రవ్యాలకు నో చెప్పేలా పోలీస్ శాఖకు సహకరించాలని తెలిపారు. ఎక్కడైనా డ్రగ్స్ అమ్మకం, కొనుగోలు చేసే వ్యక్తుల సమాచారాన్ని తమకు తెలియజేయాలని చెప్పారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులతో మత్తు పదార్థాల రహిత సమాజం కోసం అందరూ కట్టుబడి ఉండాలని ఆయన ప్రతిజ్ఞ చేయించారు.

వాణిజ్య ఒప్పందాలను వ్యతిరేకించండి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కేంద్ర ప్రభుత్వం చేసుకుంటున్న విదేశీ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలతో దేశ వ్యవసాయ రంగానికి తీవ్ర నష్టం జరుగుతున్నదని దీనిని వ్యతిరేకించాలని వామపక్ష రైతు కౌలు రైతు సంఘాల జిల్లా కార్యదర్శులు బి దస్తగిరి రెడ్డి, టక్కోలి మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం రైతు సంఘాలు, కేంద్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు నగరంలోని పాలెంపల్లి సచివాలయం దగ్గర ఒప్పంద పత్రాలను దహనం చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

ముంచుకొస్తున్న వ్యాధుల కాలం

- జాగ్రత్తల పాటింపుతోనే రోగాల నుంచి రక్ష
- లేకుంటే ఆస్పత్రుల పాలే
- సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన చర్యలపై వైద్యుల సూచన



చిన్నమండెంలో వర్షానికి పేరుకుపోయిన చెత్తాచెదారం

చిన్నమండెం : వర్షాకాలం వచ్చిందంటే వ్యాధులు సోకే ప్రమాదం పొంచి ఉంటుంది. డ్రైనేజీల పారుదల సక్రమంగా లేక రోజుల తరబడి మురుగునీరు నిలిచిపోవడం, పారిశుధ్యం మెరుగ్గా లేని ప్రాంతాల్లో దోమలు, సూక్ష్మక్రిములు వృద్ధి చెంది వ్యాధులకు కారకాలుగా మారతాయి. దీంతో జ్వరంతోపాటు ఇతర అనారోగ్య సమస్యల బారినపడే ప్రమాదముందని, తగు జాగ్రత్తలు తీసుకోవాలని చిన్నమండెం పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ సునీతారెడ్డి సూచిస్తున్నారు. పర్తి ఏడాది జ్వరాల వల్ల చనిపోతున్న వారి సంఖ్య పెరుగుతుందని ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని చెబుతున్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించడంతో పాటు జ్వరం, ఇతర అనారోగ్య సమస్యలు వస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను ఆశ్రయించాలని సూచించారు. వర్షాకాలంలో వచ్చే వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆమె వివరించారు.

సాధారణ జ్వరం, జలుబు

సీజన్ మార్పుతో పెరిగే సూక్ష్మక్రిముల వల్ల వైరల్ జ్వరాలు వ్యాప్తి చెందుతాయి. గాలి, నీటి ద్వారా మనవ శరీరంలోకి సూక్ష్మజీవులు ప్రవేశిస్తాయి. వైరస్ రకాన్ని బట్టి జ్వరం ఉంటుంది. జ్వరం మాత్రమే కాకుండా కొందరికి దగ్గు, కీళ్లనొప్పులు ఉంటాయి. వైరల్ జ్వరం 3 నుంచి 7 రోజుల వరకు ఉంటుంది.

చికెన్‌గున్యా

తీవ్రమైన జ్వరం, కీళ్లనొప్పులు చికెన్‌గున్యా లక్షణాలు. ఈ జ్వరం దోమకాటు వల్ల వస్తుంది. చికెన్ గున్యా సోకితే మొదటి రెండు, మూడు రోజులు జ్వరం ఎక్కువగా ఉంటుంది.

మలేరియా

తీవ్రమైన తలనొప్పి, వణుకుతో కూడిన అధిక జ్వరం మలేరియా లక్షణం. జ్వరం తగ్గి మళ్లీ వస్తుంది. మలేరియా ఆడ అనాఫిలిస్ దోమకాటుతో వ్యాప్తి చెందుతుంది. దోమకాటు వల్ల దాని లోపల ఉన్న మలేరియా క్రిములు శరీరం లోపలికి వెళ్తాయి. 14 రోజుల తర్వాత అధిక జ్వరం వస్తుంది. ఈ దోమలు నిల్వ ఉన్న వర్షపునీటిలో వృద్ధి చెందుతాయి.

డెంగీ

ఈడిస్ ఈజిప్ట్ అనే దోమకాటుతో డెంగీ వ్యాప్తి చెందుతుంది. ఈ దోమ పగటిపూట మాత్రమే కుడుతుంది. దోమ కుట్టినప్పుడు ఒళ్లంతా దద్దుర్లు కనిపిస్తాయి. వైరల్ జ్వరం మాదిరి అకస్మాత్తుగా జ్వరం వస్తుంది. తలనొప్పి, ఒళ్లునొప్పులు, కీళ్లనొప్పులతో ఎముకలు విరిగేటంత నొప్పి కలిగిస్తుంది. ఒక్కోసారి శరీరం లోపలి భాగాల్లో రక్తస్రావం జరుగుతుంది. దానివల్ల కాళ్లు, చేతులు, ముఖం, వీపు భాగాల చర్మంపై ఎర్రగా కందినట్లుగా చిన్నచిన్న మొటిమలు కనిపిస్తాయి. ఒక్కోసారి ప్లేట్‌లెట్స్ తగ్గిపోయి రోగి పరిస్థితి విషమంగా ఉంటుంది.

హెపటైటిస్ – ఏ

వర్షాకాలంలో హెపటైటిస్ ఏ 'కామెర్లు'వ్యాధి ఎక్కువగా వచ్చే అవకాశం ఉంది. ఇది కాలేయ కణాల్లో సంక్రమణ వల్ల కలుగుతుంది. ఈ వ్యాధి సూక్ష్మక్రిములు కలుషితమైన ఆహార పదార్థాల నుంచి, తాగునీటి నుంచి శరీరంలోకి ప్రవేశిస్తాయి. కాలేయ వ్యాధి కారణంగా రక్తంలో బైలురుబిన్ పరిమాణం పెరుగుతుంది. శరీర భాగాలు పసుపు రంగులో కనిపిస్తాయి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- ఇంటి పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి
- పెంటకుప్పలు, చెత్తాచెదారం ఇంటికి దూరంగా వేయాలి
- ఇంటి పరిసరాల్లో కొబ్బరి, బోండాలు, పాత టైర్లు, ఖాళీ డబ్బాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలి
- ఇంటిలో అన్ని గదుల్లో దోమలు రాకుండా చూసుకోవాలి. దోమతెరలు వాడటం శ్రేయస్కరం
- శరీరం మొత్తం కప్పేలా ఉన్న దుస్తులు ధరించాలి
- వారంలో ఒక రోజు డ్రైడే పాటించాలి
- నీళ్ల ట్యాంకులపై సరైన మూతలను అమర్చాలి
- వర్షంలో తడవరాదు. తడిచిన బట్టలలో ఎక్కువ సేపు ఉండకూడదు
- భోజనం చేసే ముందు తప్పనిసరిగా చేతులు శుభ్రం చేసుకోవాలి
- కాచి చల్లార్చిన నీటిని తాగాలి
- బయట ఆహారం తినకూడదు
- నిల్వ పదార్థాలు తినరాదు. వేడి ఆహార పదార్థాలు తినడం మంచిది.
- తాజాపండ్లు, పండ్ల రసాలు, కొబ్బరినీళ్లు తీసుకోవాలి
- వ్యక్తిగత మరుగుదొడ్లు వినియోగించాలి

సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్త



వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉంటుంది. వ్యక్తిగత శుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించడంతో పాటు కలుషిత ఆహారం, కలుషిత నీరు తాగకుండా ఉండటం ద్వారా వ్యాధులు సోకకుండా రక్షణ పొందవచ్చు. జ్వరం ఇతర అనారోగ్య సమస్యలు వస్తే వెంటనే వైద్యులను ఆశ్రయించాలి. ప్రభుత్వాసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు, అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయి.

– డాక్టర్ సునీతారెడ్డి, వైద్యురాలు, పీహెచ్‌సీ, చిన్నమండెం

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టండి



ఎస్ఎన్ కాలనీలో మురికి కాలువను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

రాయచోటి టౌన్ : పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సచివాలయ ఉద్యోగులకు రాయచోటి మున్సిపల్ కమిషనర్ జి.రవి సూచించారు. బుధవారం పట్టణంలోని ఎస్ఎన్ కాలనీలో ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆ ప్రాంతంలో పేరుకపోయిన మురుగునీటిని పరిశీలించి వెంటనే ఆ ప్రాంతాన్ని శుభ్రం చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం కురుస్తున్న వానలకు ఎక్కడ పడితే అక్కడ మురుగునీరు పేరుకుపోతుందని, అలాంటి ప్రదేశాలను గుర్తించి వెంటనే శుభ్రం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ నూర్జహాన్, హెల్త్ అసిస్టెంట్ రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

15న కల్వరి టెంపుల్ మెగా యూత్ ఫెస్ట్

కడప కోటిరెడ్డిసర్కిల్ : కల్వరి టెంపుల్ ఆధ్వర్యంలో ఈనెల 15వ తేదీన ఎర్రముక్కపల్లె భాకరాపేట రైల్వేగేటు వద్దగల విశ్వనాథపురంలోని ఎస్ఎల్ఎన్ ఫంక్షన్ హాలులో మెగా యూత్ ఫెస్ట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.